www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

5

ఏలూరు

10న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

ప్రచార కరపత్రాలు ఆవిష్కరించిన డిఎంహెచ్ఒ మాలతి

ఏలూరు : జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం ఈనెల 10వ తేదీ సందర్భంగా గురువారం స్థానిక డిఎంహెచ్ఒ కార్యాలయంలో నులిపురుగుల నివారణ, ఆల్బెండజోల్ మాత్రల ఆవశ్యకతకు సంబంధించిన ప్రచార వీడియోలు, కరపత్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఆర్.మాలతి ఆవిష్కరించారు. 1 నుంచి 19 సంవత్సరాలు గల ప్రతి ఒక్కరికీ ఈ మాత్రలు పంపిణీ చేయవలసిందిగా ఆదేశించారు. 10వ తేదీన ఎవరైనా మాత్రలు వేసుకోని పక్షంలో వారితో ఈనెల 17వ తేదీన మాప్ అప్ డే రోజు వారిచేత మింగించవలసిందిగా ఆదేశించారు. ఈ ప్రోగ్రామ్ నూరుశాతం విజయవంతం చేయడానికి విద్య, అంగన్వాడీ, సంబంధిత లైన్ డిపార్ట్మెంట్స్‌తో సమన్వయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్బిఎస్‌కె జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ కె.నరేంద్ర కృష్ణ, ఎన్‌టిఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్, డాక్టర్ భార్గవి, ఆర్‌బిఎస్‌కె జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నరేష్ బొప్పన పాల్గొన్నారు.

అట్టహాసంగా పిడిఎఫ్ అభ్యర్థి

డివి.రాఘవులు నామినేషన్

పాల్గొన్న పిడిఎఫ్ ఎంఎల్‌సిలు లక్ష్మణరావు, ఐవి, గోపీమూర్తి

ఏలూరులో ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల భారీ ర్యాలీ

ఏలూరు నగరంలో పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు నామినేషన్ సందర్భంగా ర్యాలీ

నామినేషన్ అనంతరం సభలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్, సిటీ

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థిగా దిడ్ల వీర రాఘవులు (డివి.రాఘవులు) నామినేషన్ కార్యక్రమం భారీ ర్యాలీతో అట్టహాసంగా సాగింది. ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్ నుండి వందలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు, కార్మిక, ప్రజాసంఘాల నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలొచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయం నుండి ఫైర్ స్టేషన్ మీదుగా కలెక్టరేట్ వరకు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వికి అభ్యర్థి డివి.రాఘవులు నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం సిఐటియు కార్యాలయం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ బహిరంగ సభకు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి అధ్యక్షత వహించి మాట్లాడుతూ 2007 నుంచి పిడిఎఫ్ అభ్యర్థులుగా గెలుపొందిన వారు నీతి, నిజాయతీకి నిదర్శనంగా నిలిచారన్నారు. ముఖ్యఅతిథి శాసనమండలిలో పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్, కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడే శక్తి పిడిఎఫ్ అభ్యర్థులకు మాత్రమే ఉందన్నారు. స్వలాభం కోసం కాకుండా ప్రజా సంక్షేమం కోసం పాటుపడే అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. డివి.రాఘవులు 40 సంవత్సరాలుగా యుటిఎఫ్‌లో వివిధ స్థాయిల్లో పని చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. ఎన్నికకు కేవలం 20 రోజుల సమయం మాత్రమే ఉందని, ఈ 20 రోజులు 24 గంటలు పని చేయాలని కోరారు. కూటమి అభ్యర్థికి రాజకీయ, కుల, ధన, బలాలు ఉన్నాయని, మన పిడిఎఫ్ అభ్యర్థికి ప్రజాబలం, కార్యకర్తల బలం, సంఘాల బలం ఉందని తెలిపారు. సోషల్ మీడియాను ఉపయోగించుకుని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. డివి.రాఘవులు విజయం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.



రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వికి నామినేషన్ పత్రాలు అందిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు

సభలో మాట్లాడుతున్న గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎంఎల్‌సిలు ఇళ్ల వెంకటేశ్వరరావు, బి.గోపీమూర్తి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, ప్రజాసంఘం నేత మంతెన సీతారాం

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి పాలకులు ప్రజల జీవితాలు ఫణంగా పెట్టి కార్పొరేట్ కంపెనీలకు అనుకూలమైన చట్టాలు చేస్తున్నారని విమర్శించారు. పాలకుల తప్పుడు విధానాలను ప్రశ్నించి ప్రజా సమస్యలను లేవనెత్తి పరిష్కారం కోసం కృషి చేసే రాఘవులును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. శాసనసభలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై అడిగేవారే లేరని, ఈ పరిస్థితుల్లో ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సిఐటియు ఎటువంటి ఉద్యమం చేసినా రాజకీయాలతో సంబంధం లేకుండా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు సహకరించేవారని గుర్తు చేశారు. ప్రజాసంఘాల రాష్ట్ర నేతలు మంతెన సీతారాం, బి.బలరాం మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికలు అంటే అంటే ఓటర్లు పిడిఎఫ్ అభ్యర్థులకే ఓట్లు వేస్తారని, ప్రస్తుతం ఆ సీటు కోసం సంబంధం లేని వారు పోటీ చేస్తున్నారని, రాజ్యాంగం మనకు కల్పించిన హక్కుని రాజకీయ పార్టీలవారు లాక్కోవాలని చూస్తున్నారని అన్నారు. దీన్ని తిప్పికొట్టి పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్, సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు కె.ఉమామహేశ్వరరావు, పి.చంద్రశేఖర్, ఎస్.బాలాజీ, జ్యోతిబసు, శ్రీదేవి, అరుణకుమారి, రవికుమార్, ముస్తఫా ఆలీ, విజయరామరాజు, రామభద్రం, జయకర్, షరీఫ్, నరేష్, డిఎన్‌వివి.ప్రసాద్, ఎ.రవి, ఎస్ఎన్.రమేష్, జి.రవికిషోర్, బేబీరాణి, జెఎన్‌వి.గోపాలన్, అరుణ్‌కుమార్, ఐవి.సుధాకర్, కె.రాజారామ్మోహన్‌రాయ్, ఆర్.లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కంటైనర్

ఊక జట్టు కూలీలు ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి – ఉంగుటూరు

జాతీయ రహదారి నాచు గుంట వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఊక లారీ జట్టు కూలీలు దోమతోటి దేవమందిరం, గోగులమూడి విజయబాబు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. దీనికి సంబంధించి చేబ్రోలు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం ఆరుగొలనుకు చెందిన మృతులు ఊక లారీపై జట్టు కూలీలుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి హనుమాన్ జంక్షన్ నుంచి ఊక లోడుతో తాడేపల్లిగూడెం వెళ్లి దిగుమతి చేశారు. తిరుగు ప్రయాణంలో హనుమాన్ జంక్షన్ బయల్దేరగా ఆ లారీ ఉంగుటూరు మండలం నాచుగుంట వద్దకు రాగానే సుమారు రాత్రి రెండున్నర గంటల సమయంలో మరమ్మతుకు గురై నిలిచిపోయింది. దీంతో లారీని పక్కన పెట్టి డ్రైవర్ ఇంటి కిషోర్ లారీ కిందకు వెళ్లి మరమ్మతులు చేస్తుండగా, జట్టు కూలీలు దేవమందిరం, విజయబాబు లారీ వెనుక నిలబడి ఉన్నారు. ఆ సమయంలో తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వెపు వెళ్తున్న కంటైనర్ లారీ అతి వేగంతో వచ్చి లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఊక జట్టు కూలీలు దేవమందిరం (37), విజయబాబు (38) తలలు చిధ్రమై అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. చేబ్రోలు ఎస్ఐ ఎం.సూర్యభగవాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

2వ తేదీకి నూజివీడు బాలోత్సవం వాయిదా

ప్రజాశక్తి – నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలో ఈ నెల ఏడో తేదీన నిర్వహించాల్సిన బాలోత్సవం అనివార్య పరిస్థితుల్లో వాయిదా వేశామని, మార్చి రెండో తేదీన నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. బాలోత్సవ కమిటీ సమావేశం గురువారం జరిగింది. వివిధ విద్యాసంస్థల నిర్వాహకులు, ఉపాధ్యాయులతో మాట్లాడాక వచ్చే నెల రెండో తేదీ ఆదివారం నాడు బాలోత్సవం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆ బాలోత్సవాన్ని జయప్రదం చేయాలని నిర్వాహక కమిటీ కోరింది.

మండలం యూనిట్‌గా పరిహారం చెల్లించాలి

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

కాంటూరుతో సంబంధం లేకుండా మండలం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకుని పరిహారం చెల్లించాలని, పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సమావేశం తెల్లం రామకృష్ణ అధ్యక్షతన గురువారం జరిగింది. సమావేశంలో రవి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం పటిష్టంగా అమలు చేయాలన్నారు. 2022లో వచ్చిన గోదావరి వరదల ప్రాతిపదికన కాంటూర్‌తో సంబంధం లేకుండా మండలం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకుని పునరావాస పరిహారం చెల్లించాలని కోరారు. కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా పునరావాస పరిహారం పెంచాలని, ప్రతి నిర్వాసితునికీ రూ.20 లక్షలు చెల్లించాలని కోరారు. మిగులు భూములు సర్వే చేసి పరిహారం చెల్లించాలని, సాగులో ఉన్న పోడు భూములకు సర్వే చేసి ప్రతి ఎకరాకు పరిహారం చెల్లించాలని కోరారు. గతంలో రూ.1.15 లక్షలు ఇచ్చిన భూములకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలన్నారు. ప్రతి నిర్వాసిత కుటుంబానికీ ఉద్యోగం ఇవ్వాలని, పునరావాస కాలనీల్లో 25 రకాల మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పెళ్లయిన ఆడ పిల్లకు పునరావాస పరిహారం చెల్లించాలన్నారు. నిర్వాసితుల సమస్యలపై దరఖాస్తుల పేరుతో కొన్ని వ్యాపార సంస్థలు దోపిడీకి పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇవి పునరావృతం కాకుండా అరికట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌వివిడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, జి.రాజు, ఎం.నాగమణి, పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో నిబంధనల ప్రకారం తనిఖీలు

జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆర్.మాలిని

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

స్కానింగ్ సెంటర్లకు సంబంధించి నిబంధనల ప్రకారం మూడు నెలలకు ఒకసారి సందర్శిస్తారని, స్కానింగ్ సెంటర్లు, రక్త పరీక్షా కేంద్రాల్లో టెక్నికల్ పర్సన్స్ మాత్రమే ఉండాలని, అందుకు అనుగుణంగానే అనుమతులు ఇస్తామని, నిబంధనలు పాటించకపోతే అనుమతులు రద్దు చేస్తామని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆర్.మాలిని తెలిపారు. గురువారం 'రోగాల పుట్ట.. వైద్య ఆరోగ్యశాఖ' శీర్షికన 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనానికి డిఎంహెచ్ఒ స్పందించి వివరణిచ్చారు. ఏలూరు సుస్మిత డయోగ్నోస్టిక్ సెంటర్‌లో ఓ మహిళ ఎంఆర్ఐ స్కానింగ్ చేస్తూ ఉండగా మృతి చెందిన ఘటనలో ఆయుష్ హాస్పటల్ నుంచి రిఫర్ చేసిన డాక్టర్ ప్రవీణ్‌ను వివరణ కోరినట్లు తెలిపారు. జిల్లాలో వంద స్కానింగ్, మరో వంద బేసిక్ ల్యాబ్స్, 263 ప్రయివేటు ఆసుత్రులకు అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. నిబంధనలు పాటించి వెరిఫికేషన్ చేసి అన్ని పత్రాలు పొందుపరిచిన వారికే అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎవరైనా నిబంధనలకు విరద్ధంగా నిర్వహిస్తే నోటీసులు ఇస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్ల నుండిగాని ఎటువంటి మామూళ్లు తీసుకోలేదని, వైద్యఆరోగ్య శాఖ ఎక్కడా నిర్లక్ష్యం వహించలేదని, ఎటువంటి అధికార దుర్వినియోగం చేయలేదని డిఎంహెచ్ఒ తెలిపారు.

పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానానికి రెండు నామినేషన్లు

ఐదుకు చేరిన నామినేషన్లు సంఖ్య - శని, ఆదివారాలు సెలవు దినాలు - మరో రెండు రోజులు మాత్రమే మిగిలిన గడువు

ప్రజాశక్తి – ఏలూరు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి గురువారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఏలూరు కలెక్టరేట్లో తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు, కాకినాడకు చెందిన ఇండిపెండెంట్ అభ్యర్థి కాట్రు నాగబాబులు ఒకొక్కరు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. పిడిఎఫ్ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అభ్యర్థులతో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. దీంతో నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన ఈ నెల మూడో తేదీ నుంచి ఇప్పటి వరకు మొత్తం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఎన్నికల విభాగం తహశీల్దార్ చల్లన్నదొర తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల మూడో తేదీ నుంచి పదో తేదీ వరకూ నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌లో పేర్కొంది. రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు రావడంతో ఈ రెండు రోజులు నామినేషన్ల స్వీకరణ ఉండదని పేర్కొంది. దీంతో ఏడో తేదీ శుక్రవారం, ఆఖరి రోజు పదోతేదీ సోమవారం రెండు రోజులు మాత్రమే నామినేషన్లకు గడువు మిగిలి ఉంది. టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ పదో తేదీన నామినేషన్ వేయనున్నారు.

'ఇళ్లే' బకాయిలు ఇచ్చేదెప్పుడు..!

2014-19 మధ్య టిడిపి పాలనలో బకాయిలు పెండింగ్

ఏలూరు జిల్లాలో రూ.40.90 కోట్లు, 'పశ్చిమ'లో రూ.40.75 కోట్ల బకాయిలు పెండింగ్

గత వైసిపి ప్రభుత్వంలో లబ్ధిదారులకు తీరని అన్యాయం

సర్వే చేసి లెక్కలు తేల్చిన అధికారులు.. సొమ్ము జమలో మాత్రం తాత్సారం

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రభుత్వ సాయంతో ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. 2014-19 మధ్య ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకంలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల దుస్థితే అందుకు ప్రత్యక్ష నిదర్శనం. దాదాపు ఆరేళ్లు గడిచినా ఇప్పటికీ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వ సాయం అందని పరిస్థితి. 2014-19 మధ్య టిడిపి పాలనలో మొదటి మూడేళ్లు ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియను ప్రభుత్వం చేపట్టలేదు. దీంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకంలో ఏలూరు జిల్లాలో దాదాపు 26,840, పశ్చిమగోదావరి జిల్లాలో 25,855 ఇళ్లను మంజూరు చేసింది. సొంతింటి కల నెరవేర్చుకునేందుకు లబ్ధిదారులు ఉన్న చిన్నపాటి ఇంటిని తొలగించుకుని ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు ఇస్తామని అప్పట్లో ప్రభుత్వం చెప్పింది. ఈ సొమ్ము రూ.లక్షన్నర కేంద్ర ప్రభుత్వం, రూ.లక్ష రాష్ట్ర ప్రభుత్వం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. కొంతమంది లబ్ధిదారులకు మొదటి విడత, మరికొంతమందికి రెండోవితగా కొంత సొమ్ము జమ చేయడం తప్ప పూర్తిస్థాయిలో జమ కాలేదు. చాలామందికి అసలు రూపాయి కూడా ప్రభుత్వ సాయం జమ కాలేదు. 2019 ఎన్నికల ముందు ఇళ్లకు సంబంధించిన సొమ్ము విడుదల చేస్తామని అప్పట్లో టిడిపి ప్రభుత్వం చెప్పినా చేయలేదు. 2019 ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో టిడిపి ఓడిపోయింది.

అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఇళ్ల నిర్మించుకున్న లబ్ధిదారుల గురించి పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో బకాయిలిస్తామని చెప్పినప్పటికీ పట్టించుకోలేదు. దీంతో అప్పు చేసి ఇళ్ల నిర్మించుకున్న లబ్ధిదారులు తీవ్ర కష్ట, నష్టాలను ఎదుర్కొన్న పరిస్థితి. ఇళ్ల నిర్మాణం కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి తీవ్ర కష్టాలను చవిచూశారు.

బకాయిల విడుదలలో తాత్సారం

2024 మేలో జరిగిన సాధారణ ఎన్నికల్లో టిడిపి కూటమి అఖండ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వంలో ఇళ్ల నిర్మించుకుని ప్రభుత్వ సాయం అందని లబ్ధిదారులకు బకాయిలు అందిస్తామని ప్రకటించింది. అప్పట్లో ఇళ్ల నిర్మించుకుని బకాయిలు అందని లబ్ధిదారుల జాబితాను తయారు చేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. సర్వే చేసిన అధికారులు అప్పట్లో ఏలూరు జిల్లా పరిధిలో 26,840 మంది లబ్ధిదారులకు రూ.40.90 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 25,855 మంది లబ్ధిదారులకు రూ.40.75 లక్షలు బకాయి ఉన్నట్లు తేల్చారు. సర్వే పూర్తయ్యి రోజులు గడిచిపోతున్నా బకాయిల సొమ్ము మాత్రం ప్రభుత్వం విడుదల చేయడం లేదు. అదిగో.. ఇదిగో అంటూ కాలక్షేపం చేస్తోంది. లబ్ధిదారులంతా బకాయి సొమ్ము కోసం గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.

ముంపు ప్రభావిత ప్రాంతాల్లో నేషనల్ డిజాస్టర్ టీమ్ పర్యటన

ఆర్‌అండ్‌ఆర్ పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని నిర్వాసితుల ఆవేదన

వేలేరుపాడు రూరల్ : వరద ప్రభావిత ప్రాంతాలలో నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ టీం గురువారం పర్యటించారు. వరద ముంపు ప్రాంతాలైన తాట్కూరు గొమ్ము, రేపాకగొమ్ము, రుద్రం కోట, ఎద్దువాగు తదితర గ్రామాలలో వరదలు వచ్చినప్పుడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేశారు. ఈ టీం పర్యటనలో శుద్ధ గుంపు చాగరపల్లి, తాట్కూరు గొమ్ము కాలనీ నిర్వాసితులను కలిసి గోదావరి వరదలు వచ్చినప్పుడు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందుతున్నాయి, అసలు వరదలు వస్తున్నాయని ముందుగా అధికారులు తెలియజేస్తున్నారా లేదా, వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రథమ చికిత్సలకు అధికారులు అందుబాటులో ఉంటున్నారా లేదా అని నిర్వాసితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్వాసితులు మాట్లాడుతూ గోదావరి వరదలు వచ్చినప్పుడు పిల్లాపాపలతో చెట్టుకొకరు, పుట్టకొకరుగా కొండగుట్టలపై ఆవాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నామని, ఆ కొండగుట్టలపై ప్రాణభయంతో కొట్టుమిట్టాడుతూ బ్రతుకుతున్నామని, ప్రభుత్వం ఎన్ని సదుపాయాలు అందించినా మా బాధలు వర్ణణాతీతమని వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా 2022 గోదావరి వచ్చి మండలం మొత్తం అల్లకల్లోలం అయిపోయిందని, నిర్వాసితులందరికీ న్యాయం చేసి మండలంలోని అర్హులైన ప్రతి ఒక్క నిర్వాసితుడికి పూర్తిగా ఆర్‌అండ్‌ఆర్ పరిహారం ఇచ్చి ప్రభుత్వం నిర్మించే పునరావాస కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. నిర్వాసితులను అక్కడ తరలించవలసిందిగా డిజాస్టర్ టీం సభ్యుల ముందు నిర్వాసితులు వేడుకున్నారు. ఈ పర్యటనలో కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రీస్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ స్వాతి సులఫ్ము, డిప్యూటీ డైరెక్టర్ జెస్సీ ఆనంద్, వారి బృందం, స్థానిక తహశీల్దార్ డివి.సత్యనారాయణ, విఆర్ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

469 గ్రాముల బంగారు ఆభరణాలు, 41 కేజీల వెండి స్వాధీనం : ఎస్పి ప్రతాప్‌శివ కిషోర్

ఏలూరు స్పోర్ట్ : ముఠాలో ఒక నేరస్తుడు నేరాలకు పథకం వేస్తాడు. ఇంకొకడు జనాల్లో కలిసి తిరుగుతూ ఉంటాడు. ఏదో ఒక పని చేస్తున్నామని స్థానికంగా ఉన్న ప్రజల్ని, వ్యాపారస్తుల్ని నమ్మిస్తాడు. ఆపై తన కర్కోటక ముఠాకు వివరాలు ఇస్తాడు. చివరికి వారు వచ్చి పక్కా పథకం ప్రకారం వారి లక్ష్యాన్ని కొల్లగొడతారు. ఇది గత కొంతకాలంగా ఈ రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ముఠా కొనసాగించే నేరాల తీరు. ఎట్టకేలకు ఒకటో పట్టణ పోలీసులు ఈ కరుడుగట్టిన నేరస్థులకు చెక్ చెప్పి వారిని కటకటాల పాలు చేశారు. వారి వద్ద నుంచి భారీగా బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పి ప్రతాప్ శివ కిషోర్ గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన తెలిపిన వివరాల ప్రకారం గత నెల 11వ తేదీ అర్ధరాత్రి నుంచి 12వ తేదీ తెల్లవారుజాము మధ్యలో ఏలూరు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ బంగారు దుకాణంలో చోరీ జరిగింది. దీనిపై లోకేశ్వరి జ్యువెలర్స్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి నేరస్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుల కోసం గాలిస్తున్న సమయంలో గురువారం ఉదయం వారు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో చింతలపూడి రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని అదుపులోకి తీసుకున్న అనంతరం ఏలూరు ఒకటో పట్టణ పోలీసులకు విస్తు పోయే నిజాలు తెలిశాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన నలుగురు ముఠా సభ్యులు ఈ ముఠాలో ఉన్నట్లు గుర్తించారు. వారిలో ముగ్గురు దొంగతనాలకు పాల్పడుతుంటే ఒకడు మాత్రం వీరి దొంగతనాలకు పథక రచన, వ్యూహరచన చేస్తూ ఉంటాడు. వీరిలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బీదౌలి గ్రామానికి చెందిన కుల్దీప్ శర్మ, రెండోవాడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రా జిల్లాకు చెందిన మనోజ్ కుమార్ కాగా మూడోవాడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రా జిల్లాకు చెందిన మహేందర్ సింగ్‌గా గుర్తించారు. అయితే ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రా జిల్లాకు చెందిన రాజేష్ కుసువాహ అలియాస్ టీటు గత కొన్ని సంవత్సరాల క్రితం ఏలూరు నగరంలో బంగారు పని నిమిత్తం వచ్చి అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నాడు. స్థానికంగా ఉన్న తాపీ మేస్త్రికాలనీలో మకాం పెట్టాడు. ఈ రాజేష్ ఏలూరు నగరంలో బంగారు ఆభరణాల పనులు చేస్తూ స్థానికంగా ఉన్న దుకాణాలపై రెక్కీ నిర్వహిస్తూ ఉంటాడు. అనంతరం తన స్నేహితులైన కుల్దీప్ శర్మ, మనోజ్ కుమార్, మహేందర్ సింగ్‌కు వివరాలు చెప్పి వారిని ఈ దొంగతనాలు చేసేందుకు పురిగొల్పుతాడు. అయితే వీరిని అరెస్ట్ చేసిన ఒకటో పట్టణ పోలీసులు వారి వద్ద నుంచి 469 గ్రాముల బంగారు ఆభరణాలు, 41 కేజీల వెండి ఆభరణాలు, ఒక లాప్‌టాప్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ప

రాజకీయ నాయకుల ఫ్లెక్సీలకు ముసుగులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎన్నికల కోడ్ ఉల్లంఘన అనే అంశంతో బుధవారం ప్రచురితమైన రాజకీయ నాయకుల ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీలను అధికారులు గుడ్డలతో కప్పుతున్నారు. ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఫ్లెక్సీల మూసివేత కార్యక్రమాన్ని రోజుల తరబడి చేస్తున్నారు. కొన్నిచోట్ల మూసేసి, కొన్నిచోట్ల అలాగే వదిలేశారు. కలెక్టర్ ఆదేశాలను అనుసరించే ఉద్దేశం నగరపాలక సంస్థ అధికారులకు లేదేమో అని ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు.


ఫ్లెక్సీలకు ముసుగు వేసిన అధికారులు

ప్రాంతీయ పర్యవేక్షణాధికారిగా యోహాన్

ఏలూరు అర్బన్ : ఇంటర్మీడియట్ జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారిగా(పూర్తి అదనపు బాధ్యతలు) కె.యోహాన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఆర్ఐఒగా పనిచేసిన కె.చంద్రశేఖర్ బాబుకు జిల్లాలో మూడు సంవత్సరాల సర్వీసు పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి ఈ బదిలీ ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలుస్తుంది. ఆగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న యోహాన్‌కు ఆర్ఐఒగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే చంద్రశేఖర్ బాబును పెంటపాడు ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపల్‌గా బదిలీ చేశారు.

నేడు, రేపు నాటకోత్సవాలు

మండవల్లి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నాట్యకోత్సవాలను నిర్వహిస్తున్నామని ఆర్గనైజర్ శాంతకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని తక్కెళ్లపాడులో శుక్ర, శనివారాలలో సాయి బాలాజీ నాట్యమండలి ఆధ్వర్యంలో నాట్యకోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సత్య హరిచంద్రయము, బాలనాగమ్మ నాటకాలను ప్రదర్శించడం జరుగుతుందని అన్నారు. కళను, కళాకారులను ప్రోత్సహించే విధంగా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ నాటక ప్రదర్శన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆమె కోరారు.

చిన వెంకన్న హుండీ ఆదాయం రూ.3,11,12,331

ద్వారకా తిరుమల: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీలు గురువారం ఉదయం ప్రమోద మండపంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతల నడుమ లెక్కించారు. ఈ హుండీల లెక్కింపు ద్వారా గడచిన 30 రోజులకు గాను రూ.3,11,12,331 ఆదాయం వచ్చింది. అలానే భక్తుల కానుకల రూపేణ 305 గ్రాముల బంగారం, 6 కేజీల 455 గ్రాముల వెండి, పాత రూ.500(38నోట్లు), రూ.1000(3 నోట్లు), రూ.2 వేలు(20నోట్లు) పలు దేశాల విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు, ఈ హుండీల లెక్కింపులో ఆలయ సిబ్బంది అధికారులు, అర్చకులు పాల్గొన్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావు తెలిపారు.

పరిశ్రమల శాఖ కార్యదర్శిని కలిసిన ఎంఎల్ఏ రోషన్

చింతలపూడి : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో, చింతలపూడి నియోజకవర్గంలో పెట్టుబడులే లక్ష్యంగా గురువారం సచివాలయంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌ని కలిసి యుకె లండన్ నుంచి వచ్చిన ప్రతినిధులతో చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఏ సొంగ రోషన్ కుమార్ పాల్గొన్నారు. యువరాజు సానుకూలంగా స్పందించి వీరు సమర్పించిన డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) స్వీకరించి శాఖాపరమైన ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఎపిఐఐసి మంగళగిరి కార్యాలయంలో యుకె లండన్ నుంచి వచ్చిన పెట్టుబడి ప్రతినిధులతో టూరిజం కమిషనర్ ఆమ్రపాలి కాటాని కలిసి టూరిజం శాఖ తరుపున వారి సహాయ సహకారాలు అందించాలని కోరినట్లు తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో పర్యాటక రంగ అభివృద్ధి ఎంతో అవసరమని వివరించినట్లు తెలిపారు. వారు సానుకూలంగా స్పందించి అన్ని విధాలుగా తోడ్పడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

విద్యార్థులకు ఆత్మరక్షణ విద్య నేర్పించాలి

ఆంధ్ర ప్రజాసమితి జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని ముక్కెళ్లపాడు గ్రామానికి చెందిన ఆంధ్ర ప్రజాసమితి జిల్లా అధ్యక్షుడు పచ్చవ కోటేశ్వరరావు హోం మినిస్టర్ అనితను కలిసి 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఆత్మరక్షణ విద్య నేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. గతంలో ఉపాధ్యాయురాలిగా ఎంతో ఉన్నత సేవ చేసిన మీరు హై స్కూల్ స్థాయిలోని 9, 10వ తరగతి విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పట్ల అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జై ఆంధ్ర ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షులు సంగీపు జయరాజు పాల్గొన్నారు.

ఆలయాల హుండీలు లెక్కింపు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న వివిధ ఆలయాల హుండీలను గురువారం అధికారులు లెక్కించారు. గురజలోని వేణుగోపాలస్వామి దేవస్థానం హుండీలో రూ.7,986, గురజ రామలింగేశ్వర స్వామి దేవస్థానం హుండీలో రూ.61,716, అల్లూరు సోమేశ్వర స్వామి దేవస్థానం హుండీ రూ.52,104, వడాలి జగన్నాథ స్వామి దేవస్థానం హుండీ రూ.81,151 స్వామివార్లకు ఆదాయంగా వచ్చినట్లు పై ఆలయాల కార్య నిర్వహణ అధికారి సింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

ఉరేసుకుని ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ఏలూరు స్పోర్ట్స్ : అప్పుల బాధతోనో, మరేఇతర కారణాలతోనే ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన రెండో పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని ఇజ్రాయిల్ పేటకు చెందిన మెండాల హనుమ(25) స్థానికంగా ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య మేరీ, ఐదు నెలల కుమారుడు కలరు. ఈ క్రమంలో గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో అతను బాధపడుతున్నాడు. అప్పులు చేసి తీర్చలేని స్థితిలో ఉన్నాడు. గురువారం తెల్లవారుజామున ఇంటివద్దని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. ఇతను ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆత్మహత్యకు పాల్పడ్డాడా, మరే ఇతర కారణాలతో ఆయన ఆత్మహత్య చేసుకున్నాడా, అన్న కారణాలు ఇంకా తెలియలేదు. ఈ ఘటనపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

ఏలూరు స్పోర్ట్స్ : దేవాలయం నుంచి ఇంటికి నడిచి వెళుతున్న వృద్ధురాలు మెడలో ఆరు కాసుల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయిన ఘటన ఏలూరు ఒకటో పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. ఏలూరు ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేలూరు నగరంలోని పడమర వీధి ప్రాంతానికి చెందిన పింగళి వీరమ్మ భర్త చింతయతో కలిసి జీవిస్తుంది. వీరి పిల్లలు కూడా వీరితోనే కలిసి జీవిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంటి పక్కనే ఉన్న దేవాలయానికి ఒంటరిగా నడిచి వెళ్ళింది. తిరిగి దేవాలయం నుంచి ఇంటికి వస్తున్న సమయంలో వెనుకగా వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న ఆరు కాసుల బంగారు గొలుసును తెంపుకొని పరిగెత్తుకుంటూ పారిపోయాడు. లబోదిబోమన్న వృద్ధురాలు ఏలూరు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఎఎస్ఐ సూర్యచంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా స్థావరాలపై దాడి

200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

40 లీటర్ల నాటు సారా స్వాధీనం

చింతలపూడి : నాటు సారాయి స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. చింతలపూడి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గాజుల వారి పేట గ్రామంలో నాటు సారాయి తయారీకి పనికి వచ్చే 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 40 లీటర్ల నాటు సారాయిని స్వాధీనపరచుకున్నారు. కూతాడ వెంకన్న అను వ్యక్తిపై స్థానిక చింతలపూడి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ముద్దాయి పలగాని రాటాలు అను మహిళ తరచుగా నాటు సారాయి వ్యాపారం చేస్తున్నందున టి.నరసాపురం తహశీల్దార్ వారు రూ.5 వేల జరిమానా విధించారు. ఈ దాడులలో హెచ్‌సి పురుషోత్తమరావు, కానిస్టేబుల్స్ దుర్గాప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

జీలుగుమిల్లి: మండలంలోని రౌతుగూడెం గ్రామ శివారులో గురువారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడులు చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి.నవీన్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రౌతుగూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు దాడులు చేయగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1500 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకొని వారందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేదల ఆరోగ్య భద్రతకు మాదే భరోసా

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

గత వైసిపి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేసి ఆసుపత్రులకు బిల్లులన్నీ పెండింగ్ పెడితే, వాటిని సైతం చెల్లించి పేదల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తున్నట్లు ఏలూరు ఎంఎల్ఏ బడేటి చంటి పేర్కొన్నారు. ఏలూరులోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పలువురు తమ సమస్యలను ఎంఎల్ఏ దృష్టికి తీసుకు వచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ బడేటి చంటి మాట్లాడుతూ ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ పథకంపై గొప్పలు చెప్పుకున్న నాటి వైసిపి ప్రభుత్వం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. వివిధ ఆసుపత్రులకు కోట్ల రూపాయల్లో బిల్లులు పెండింగ్ పెట్టేసిన వైసిపి నాయకులు దొరికిన కాడికి దోచేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం

ఏలూరు ఎంఎల్ఏ బడేటి చంటి


ప్రజా వినతులు స్వీకరిస్తున్న ఎంఎల్ఏ చంటి

అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పరిస్థితికి మోక్షం కల్పించిందన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటూ మరిన్ని వ్యాధుల్ని ఎన్‌టిఆర్ వైద్యసేవల పరిధిలోకి తీసుకువచ్చామన్నారు. అంతేకాకుండా దాని పరిధిలోకి రాని వైద్యసేవల్ని సైతం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అవసరార్థులకు తక్షణ సాయం అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతోందని ఆయన స్పష్టం చేశారు. కాగా, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తిరుగులేని మెజార్టీ సాధించడమే లక్ష్యంగా శ్రమిస్తున్నామని అన్నారు. ఆ దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. తాజాగా గురువారం పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డితో ఎంఎల్ఏ బడేటి చంటి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏలూరు విచ్చేసిన రామగోపాల్ రెడ్డితో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కాసేపు ఎంఎల్ఏ చంటి చర్చించారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి నగర అధ్యక్ష, కార్యదర్శులు పెద్దిబోయిన శివప్రసాద్, రెడ్డి నాగరాజు, నాయకులు చల్లా వెంకట సత్యవరప్రసాదరావు, బెల్లపుకొండ కిషోర్, వందనాల శ్రీనివాస్, పూజారి నిరంజన్ పాల్గొన్నారు.

'హెచ్ఐవి సలహా, పరీక్ష కేంద్రం సేవలను వినియోగించుకోవాలి'

ఏలూరు సిటీ : ప్రభుత్వం ఉచితంగా అందించే హెచ్ఐవి సలహా, పరీక్ష కేంద్రం సేవలను అందుకునేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని జిల్లా లెప్రసి, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ ఎమ్.నాగేశ్వరరావు అన్నారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఏలూరులో సంచార హెచ్ఐవి సలహా పరీక్ష కేంద్రం(మొబైల్ ఐసిటిసి) ద్వారా ఉచితంగా ప్రజలు, గర్భిణులు, ట్రాన్స్‌జెండర్లు, యువతకు హెచ్ఐవి పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆ ప్రాంతంలో నివసిస్తున్న యువత, ట్రాన్స్‌జెండర్లు ముందుకువచ్చి హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మొబైల్ ఐసిటిసిలో అందించే సేవలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పి.బాలాజీ, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్, ఎ.రాజశేఖర్, శిరీష, ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారావు

ఏలూరు అర్బన్ : భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ఇచ్చిన మెమొ 1214 రద్దు చేసి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్ క్లెములు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం ఎర్ర రాంబాబు అధ్యక్షతన సిఐటియు జిల్లా కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సమావేశంలో రమణారావు మాట్లాడుతూ టిడిపి కూటమి నాయకులు ప్రధానంగా పవన్ కళ్యాణ్ ప్రతి ఎన్నికల సభలో భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలు గత ప్రభుత్వం వల్ల తీవ్రంగా నష్టపోయాయని విమర్శిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునర్దిస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని వాగ్దానాలు ఇచ్చారని, ఇప్పుడు ఆ వాగ్దానాలు అమలు చేయాలని, ప్రభుత్వం దారి మళ్లించిన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను సంక్షేమ బోర్డుకి జమ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా ప్రమాదాలలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు నష్ట పరిహారాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో అయినవర్తి మాధవ, తోట నాగు, రెడ్డి లక్ష్మణరావు, పి.శ్రీనివాసు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలి

ముసునూరు : ప్రతి ఒక్క విద్యార్థి పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని నూజివీడు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఎం.సేవియానాయక్ అన్నారు. గురువారం మండలంలోని చెక్కపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయులతో మాట్లాడి పదో తరగతి విద్యార్థులకు ఇస్తున్న శిక్షణపై ఆరా తీశారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు మొదటి మెట్టు పదో తరగతి అని కాబట్టి ఒత్తిడి లేకుండా చదువుకుని, నూటికి నూరు శాతం స్కూల్లో ఉన్న 97 మంది కూడా ఉత్తీర్ణులు అవ్వాలని సందేశాన్ని ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్బాస్, స్టాఫ్ సెక్రటరీ పద్మ కిషోర్, సీనియర్ ఉపాధ్యాయులు రాజశేఖర్, రాంబాబు, పద్మలత విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

మహాశివరాత్రి ఉత్సవాల్లో సమన్వయంతో పనిచేయాలి

ఉత్సవ కమిటీ చైర్మన్, ఆర్‌డిఒ ఎంవి.రమణ

పోలవరం : పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి లోటుపాట్లు రాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉత్సవ కమిటీ చైర్మన్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ అధికారులకు సూచించారు. గురువారం పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆర్‌డిఒ అధ్యక్షతన జరిగిన ఉత్సవ కమిటీ రెండవ సమీక్షా సమావేశంలో పలు శాఖల అధికారులు తమ శాఖల తరపున చేపట్టనున్న సేవల వివరాలను వివరించారు. ఈ సందర్భంగా పట్టిసీమ ఉత్సవ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ పి.విశ్వనాధరాజు మాట్లాడుతూ దేవస్థానం తరపున గత ఏడాది ఏర్పాటు చేసిన విధంగా చలువ పందిళ్ల 200 మీటర్ల మేర షామియానా ఏర్పాటు చేస్తామన్నారు. క్యూలైన్లలో భక్తులకు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేస్తామన్నారు. ఆర్‌అండ్‌బి, ఎపిఎస్ ఆర్‌టిసి, ఎపి టూరిజం శాఖ, మోటార్ వెహికల్ తనిఖీ శాఖ, ఎపి ట్రాన్స్‌కో శాఖ, అటవీశాఖ, వైద్యశాఖ, మత్స్యశాఖ, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ, పట్టిసీమ పంచాయతీ అధికారులు తమ పరిధిలో చేయనున్న పనులు ప్రణాళికలను వివరించారు. సర్పంచి సబ్బారపు శ్రీరామ్మూర్తి, సునకాని రాంబాబు, గ్రామస్థులు తమకు ఉత్సవ ఖర్చుల నిమిత్తం దేవాదాయశాఖ నుంచి పదిలక్షల రూపాయలు ఇప్పించాలని కోరడంతో సమీక్షా సమావేశం రసాభాసగా మారింది. దీంతో ఆర్‌డిఒ, ఆలయ ట్రస్ట్, తహశీల్దార్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు సుమారు రెండు గంటల సేపు తర్జన భర్జన పడి విషయం ఎటూ తేలకపోవడంతో మూడవ సమీక్షా సమావేశంలో ఈ విషయంపై స్పష్టత ఇస్తామని సమావేశాన్ని ముగించారు. ఉత్సవ ప్రత్యేక అధికారి విశ్వనాధరాజు ఆలయ ప్రాంగణంలో క్యూలైన్ల ఏర్పాటు, తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ కొచ్చర్లకోట వెంకట జగన్నాదరావు, ఎంపిడిఒ ఇ.శ్రీనివాస్, తహశీల్దార్ సాయిరాజు, డిఎల్‌పిఒ నజీముల్లా, ఆటవీశాఖ అధికారి ఎస్‌కె.వలీ పాల్గొన్నారు.

'పటిష్ట భద్రత.. నిఘా తప్పనిసరి'

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని ట్రిపుల్ ఐటి కళాశాలలో పటిష్టమైన భద్రతతో పాటు నిఘా తప్పనిసరిగా కొనసాగాలని నూజివీడు డిఎస్‌పి కెవిఎన్‌వి.ప్రసాద్, ఏలూరు ఎఆర్‌డిఎస్‌పిబి.చంద్రశేఖర్ సూచించారు. నూజివీడు పట్టణంలోని ట్రిపుల్ ఐటి కళాశాలలో సెక్యూరిటీ నిర్వహణ, విద్యార్థుల భద్రత పట్ల గురువారం పరిశీలన చేశారు. కళాశాల చుట్టూ ఉన్న సెక్యూరిటీ, అంతర్భాగంలో కొనసాగుతున్న సెక్యూరిటీలను పూర్తిస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల రక్షణకు సంబంధించి వివరాలు సేకరించారు. మరింత పటిష్టమైన భద్రతకు సెక్యూరిటీ ముందడుగు వేయాలన్నారు. పట్టణ ఎస్ఐ జ్యోతి బసు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

క్లాప్ ఆటో డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

ఏలూరు అర్బన్ : ఇంటింటి చెత్త సేకరించే క్లాప్ ఆటోల డ్రైవర్లను విధుల్లోకి తీసుకోని పక్షంలో ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్త ఉద్యమంగా మారుస్తామని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు తెలిపారు. అక్రమంగా విధుల నుంచి నిలిపివేయబడిన క్లాప్ ఆటోల డ్రైవర్లు గురువారం పవర్ పేట రైల్వే స్టేషన్ వద్ద నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చెత్త పన్ను రద్దు చేశామనే పేరుతో క్లాప్ ఆటోలను తొలగించడం అన్యాయం అని అన్నారు. క్లాప్ ఆటోల ఉద్యమానికి మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు, ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు అందరు మద్దతు తెలపాలని కోరారు.

'ట్రస్ట్ సేవలు అభినందనీయం'

నూజివీడు టౌన్ : మానవసేవే మాధవసేవ అన్న ఆర్యోక్తిని సామాజిక సేవ వైపు మళ్లించి, మేమున్నామంటూ పేదలకు భరోసా కల్పిస్తూ ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్న తిరివీధి లక్ష్మీ రామారావు చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్ర సింగ్ అన్నారు. గత నెల నూజివీడు పట్టణ పరిసర ప్రాంతాలలో తిరివీధి లక్ష్మీ రామారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంపులలోని వారికి గురువారం ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్ర సింగ్ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి మేమున్నామనే భరోసా కల్పిస్తూ, ఉచిత మెడికల్ క్యాంపుల నిర్వహణ ద్వారా ఆరోగ్య అభివృద్ధికి కృషి చేస్తున్న తిరివీధి లక్ష్మీ రామారావు చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం అన్నారు. వీరు చేస్తున్న సేవలు నేటి తరానికి ఆదర్శనీయంగా, మార్గదర్శకంగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ తనూజ, శ్రీనివాస్ ఉన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, కైకరం గ్రామ కాపురస్తులైన కోసనం రత్నకుమారి భర్త: అర్జున్ అను నేను నా యొక్క పాస్‌పోర్టు గణపవరం SBI సెంటర్లో జిరాక్స్ తీయించుకొని మా బంధువులు ఇంటికి వచ్చే మార్గమధ్యలో **పాస్‌పోర్టు నెం. Y7698128** గల పాస్‌పోర్టు గల పాస్‌పోర్టు మరియు జిరాక్స్ తో సహా కవర్లో పెట్టుకుని మా బంధువులు ఇంటికి వచ్చే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు. ఎంత వెతికిన దొరకలేదు. దొరికినవారు ఈ క్రింది ఫోన్ నెంబర్ కు తెలియజేయగలరు.

కోసనం రత్నకుమారి
భర్త: అర్జున్
కైకరం గ్రామం,
ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా
సెల్: 93927 38984

డాక్యుమెంటు పోయినది

ఏలూరు జిల్లా, పెదపాడు మండలం, వట్లూరు గ్రామము, డోర్ నెం. 10-72 కి చెందిన గుజ్జుల శౌరి, తండ్రి: (లేటు) గుజ్జుల ప్రకాశం అను నేను dt. 03-02-2025 వ తేదీన **డాక్యుమెంట్ నెం. 3350/2008** గల సవరణ దస్తావేజును తీసుకుని నేను సుమారు ఉదయం 11-00 గంటలకు నా ఇంటి వద్ద నుండి బండిపై ఏలూరు చాటపర్రు వెళ్తుండగా, చాటపర్రు సమీపములో చూసుకుంటే బండికి పెట్టిన కవర్ మరియు కవరులో ఉన్న సదరు సవరణ **దస్తావేజు నెం. 3350/2008** కనబడలేదు. ఎంత వెతికిన దొరకలేదు. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.

గుజ్జుల శౌరి
S/o (లేటు) గుజ్జుల ప్రకాశం
డోర్ నెం. 10-72, వట్లూరు గ్రామము,
పెదపాడు మండలం, ఏలూరు జిల్లా
సెల్: 95152 72332

మహారాజశ్రీ ఏలూరు స్పెషల్ అడిషినల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఫర్ ఎక్సైజు ఏలూరు వారి కోర్టులో
I.A. No. 7/24 in O.S.No. 50/2024

Between:

పాటిపళ్ళ వీరాంజనేయులు ...వాది

Vs

కొచ్చెర్ల ఆంజనేయులు ...ప్రతివాది

పై నంబరు దావాలో ప్రతివాది అయిన కొచ్చెర్ల ఆంజనేయులు S/o. సలా మోహనరావు, D. No. 2-245, ఈపూరు, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా వాస్తవ్యులకు I.A నెంబర్ 7/24 నందు కోర్టు సమన్లు అమలు జరగనందున అతనికి సమన్లు Substituted సర్వీసు ద్వారా అమలు చేయుటకు గాను శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున ప్రతివాది **తేది. 11-02-2025 సం.రం. తేదీన ఉదయం 10-30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియ